క్లుప్తంగా

ప్రత్యేక తరగతులు నిర్వహించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రకాశ్

కెరమెరి: బేస్‌లైన్ టెస్టులో ప్రగతి ఆధారంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ సూచించారు. శుక్రవారం మండలంలోని సుర్దాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. నాలుగో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలనకు పాఠ్యపుస్తకాలు చదివించారు. అన్ని రకాల రికార్డులు నమోదు చేయాలని హెచ్‌ఎం సురేశ్‌కు సూచించారు.

హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సు నడపాలి



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న రాంబాబు

రెబ్బెన: గోలేటి నుంచి హైదరాబాద్‌కు ఉదయం పూట ఆర్టీసీ యాజమాన్యం ఎక్స్‌ప్రెక్ బస్సు సౌకర్యం కల్పించాలని బీజేపీ మండలాధ్యక్షుడు మల్రాజు రాంబాబు శుక్రవారం ఆసిఫాబాద్ డీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన డీఎం బస్సు వేస్తామని, గోలేటి ఎక్స్‌రోడ్ వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు రాంబాబు తెలిపారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న డీఈవో యాదయ్య

రెబ్బెన: మండలంలోని నేర్పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం డీఈవో యాదయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈవో అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సమాధానాలు చెప్పగా వారి సామర్థ్యాలపై సంతృప్తి వ్యక్తంజేశారు. రెండో జత యూనిఫాంలు ఆగస్టు 15లోపు పాఠశాలలకు చేరుకునేలా చూడాలని హెచ్‌ఎంకు సూచించారు.

నేడు చెక్కుల పంపిణీ

దహెగాం: మండలంలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ మునవార్ షరీఫ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 51 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి మంజూరైందన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు హాజరవుతారని పేర్కొన్నారు. లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పశువైద్య శిబిరం

చింతలమానెపల్లి: మండలంలోని అడెపెల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువులకు పశువైద్యాధికారి శ్రీకాంత్ పరీక్షలు నిర్వహించి, టీకాలు వేశారు. మేకలు, పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, సభ్యులు సంతోష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

తపాలా శాఖలో 2.0 నూతన సాంకేతికత

నార్నూర్: తపాలా శాఖలో అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీ 2.0 నూతన సాంకేతికత ఆధునీకరణ దిశగా మార్పులు తీసుకొస్తున్నారని ఆదిలాబాద్ ఇన్‌స్పెక్టర్ నాగిరెడ్డి రాజు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోస్టల్ రంగంలో సురక్షితమైన సేవల కోసం ఆధునాతన సాంకేతిక విధానం అమలుకు రంగం సిద్ధం చేశారని అన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీ 2.0 తో అనేక రకాల సేవలను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆదిలాబాద్ సబ్ డివిజన్‌లోని అన్ని తపాలా కార్యాలయంలో జూలై 22 నుంచి సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆయన వెంట సబ్ డివిజనల్ అధికారి రమేశ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

26న మెగా జాబ్‌మేళా

ఇచ్చోడ: ఈనెల 26న మండల కేంద్రంలోని రాయల్ ప్యాలెస్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఇచ్చోడ మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి శుక్రవారం తెలిపారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాకు 60కి పైగా ప్రముఖ కంపెనీలు రానున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, ఎంబీఏ, ఎంకాం, ఎంసీఏ, చదువుకున్న యువత హాజరు కావాలని కోరారు. వివరాలకు 81069 87405 సంప్రదించాలన్నారు.

వంట బిల్లు రాక తంటా

- పది నెలలుగా రాని గుడ్డు బిల్లులు
- ఐదు నెలలుగా అందని వేతనాలు
- ఇబ్బంది పడుతున్న నిర్వాహకులు



ఆసిఫాబాద్‌రూరల్: సర్కారు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోంది. ఈ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు, కార్మికులు వంట బిల్లులు నెలనెలా రాక నానా తంటాలు పడుతున్నారు. పది నెలల గుడ్డు బిల్లులు, ఐదు నెలల నుంచి వేతనాలు రాక కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో మొత్తం 732 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 561, ప్రాథమికోన్నత పాఠశాలలు 100, ఉన్నత పాఠశాలలు 100 ఉన్నాయి. అన్ని పాఠశాలల్లో కలిపి సుమారు వెయ్యి మంది మధ్యాహ్న భోజన కార్మికులున్నారు. వీరు 35వేల మంది విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 6. 19 పైసలు, 6వ తరగతి నుంచి 8వ తరగతి వారికి రూ.9. 29 పైసలు, 9, 10వ తరగతుల విద్యార్థుల కు రూ.10.67 పైసలు చెల్లిస్తున్నారు. అదనంగా గుడ్డుకు రూ.6, గౌరవ వేతనం రూ.3వేలు ఇస్తున్నారు.

బిల్లులు రాక ఇబ్బందులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వంట చేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు, కార్మికులు గౌరవ వేతనాలు, భోజన బిల్లులు కోసం ఎదురు చూస్తున్నారు. వంట నిర్వాహకులకు గౌరవ వేతనాలు, భోజనం బిల్లులు చెల్లించకపోవడంతో అప్పు చేసి వంటలు వండి పెడుతున్నారు. ప్రస్తుతం కూరగాయలు, వంట నూనెలు, పప్పులు, కోడి గుడ్డు రేట్లు పెరగడంతో తమకు ప్రభుత్వం చెల్లించే మొత్తం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో ప్రభుత్వం అందిస్తున్న గుడ్డు తరహాలో పాఠశాలలకు సరఫరా చేయాలని కోరుతున్నారు.

అప్పులు తెచ్చి పెడుతున్నాం



ఐదునెలల నుంచి మధ్యాహ్న భోజనం బిల్లు రాలేదు. దీంతో కిరాణాషాపు యజమాని కూడా పాతవి చెల్లిస్తేనే సరుకులు ఇస్తామని చెబుతున్నాడు. దీంతో వడ్డీకి అప్పు తీసుకువచ్చి వంట చేస్తున్నాం. అన్నీ పోనూ.. మాకు అప్పులే మిగులుతున్నాయి.

– కమల, నిర్వాహకురాలు, మోతుగూడ

అధికారులు చొరవ తీసుకోవాలి



రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలి. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం నిర్వాహకులకు రూ.10వేల వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి. పెండింగ్ వేతనాలు, బిల్లులు వెంటనే చెల్లించాలి.

– కృష్ణమాచారి, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

త్వరలోనే అందజేస్తాం



పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన నిర్వాహకుల బిల్లులకు సంబంధించిన ఫైల్ ఖజానా కార్యాలయానికి పంపించాం. త్వరలోనే నిర్వాహకుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. నిర్వాహకులు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దు.

– యాదయ్య, డీఈవో

పాఠశాలలో వనమహోత్సవం



మొక్కలు నాటుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

లింగాపూర్: వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ పెద్దిరాజు, ఎంఈవో శ్రీనివాస్, రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్, ఏపీవో చంద్రయ్య, అటవీశాఖ అధికారి మహేశ్, విష్ణు, భీంరావ్, తిరుపతి, సంజీవ్, సురేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జాదవ్ లోకేందర్, అనిల్, చవాన్ సునీల్, రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న టీజీబీ మేనేజర్, ఐకేపీ ఏపీఎం

దహెగాం: స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందిస్తున్న బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నవీన్‌కుమార్, ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలు మంజూరు చేశారు. 12 సంఘాలకు 1.20 కోట్ల రుణాలను వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను సైతం అందిస్తుందన్నారు. ప్రతీ నెల రుణంతో పాటు, పొదుపు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు మహేశ్, మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ గజానంద్ సూచించారు. వందరోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్, పైకాజీనగర్, బజార్‌వాడీ సందీప్‌నగర్ వార్డుల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్, వైద్యసిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి సీజన్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇళ్లలో నిల్వ నీటిని తొలగింపజేశారు. దోమల నివారణకు మందులు పిచికారీ చేయించారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్స్ బాల్ వేయించారు. అడ వైద్యాధికారి వినోద్‌కుమార్, టీఎంసీ అరుణ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ భద్రయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి



డ్రై డేలో పాల్గొన్న అధికారులు

నార్నూర్: వర్షాకాలం సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌సీ వైద్యాధికారి జితేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఈఎంఆర్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్షాకాలం మలేరియా, డెంగ్యూ, అతిసార వ్యాధులు అధికంగా వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఏదైనా అనారోగ్య సమస్యలు వస్తే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లి నేరుగా ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు, హెచ్ఈ తులసీదాస్ రాథోడ్, చరణ్‌దాస్ చౌహాన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన డ్రై డే కార్యక్రమానికి హాజరయ్యారు. మండల కేంద్రంలోని మిలింద్‌నగర్, ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఎక్కువ రోజులు నిల్వ ఉన్న నీటిని పారబోశారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో జీవన్‌రెడ్డి, ఈవో సంజీవ్‌రావు పాల్గొన్నారు.

కొత్తపల్లి శ్రీనివాస్‌కు సన్మానం



సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కాగజ్‌నగర్‌టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన కొత్తపల్లి శ్రీనివాస్‌ను శుక్రవారం కాగజ్‌నగర్‌లో కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఆగస్టు 22 నుంచి 24 వరకు రెబ్బెన మండలం గోలేటిలో రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని టోర్నమెంట్ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ అడ్వైజర్ శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు కౌలాస్, వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి తిరుపతి, కోశాధికారి శంకర్, అనిల్‌గౌడ్, చందర్, మల్లేశ్, వెంకటరమణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న డీపీవో రమేశ్

ఇంద్రవెల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, గడువులోపు పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జి. రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్ అమరవీరుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు, పిట్టబొంగరం, దస్నాపూర్ గ్రామాల్లోని ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులకు విడతల వారీగా ఖాతాలో నిధులు జమచేయడం జరుగుతుందన్నారు. అనంతరం డొంగర్‌గావ్ గ్రామంలో నిర్వహించిన డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది గ్రామాలను సందర్శించి సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు విజయ్‌కుమార్, కారోబారి ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందించాలి



మాట్లాడుతున్న ఏసీఎంవో ఉద్ధవ్

కెరమెరి: విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని ఏసీఎంవో పుర్క ఉద్ధవ్ సూచించారు. మండలంలోని అనార్‌పల్లి ఆశ్రమోన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పాఠశాల కాంప్లెక్స్ సముదాయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ పాఠశాలలో వందశాతం హాజరు ఉండేలా చూడాలని, ప్రవేశాల సంఖ్య పెంచాలని సూచించారు. టీచింగ్ డైరీ, లెస్సన్ ప్లాన్ తప్పనిసరిగా రాయాలన్నారు. సమయపాలన పాటించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విధిగా రికార్డులు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాము, ఎస్సీఆర్‌పీలు నరేశ్, శ్యాంరావు పాల్గొన్నారు.

వ్యసనాలతో జీవితాలు నాశనం

- ఏఎస్పీ చిత్తరంజన్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏఎస్పీ

రెబ్బెన: మాదకద్రవ్యాల వ్యసనాలతో విలువైన జీవితాలు నాశనమవుతాయని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా శుక్రవారం గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఏఎస్పీకి పాఠశాల స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. సమయాన్ని వృథా చేసుకోకుండా క్రీడలపై దృష్టి పెట్టాలని కోరారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. టోర్నమెంట్‌కు 16 జట్లు హాజరు.. కాగా మొదటి రోజు క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. కార్యక్రమంలో రెబ్బెన సీఐ బుద్దె స్వామి, ఎస్సై డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ కమీషన్ల ప్రభుత్వం’



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్ఎస్పీ

కౌటాల: కాంగ్రెస్ అంటేనే కమీషన్ల ప్రభుత్వంగా మారిందని బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం కౌటాల– తుమ్మిడిహెట్టి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ రోడ్లు అధ్వానంగా ఉండి ప్రజలు ఇబ్బంది పడుతుంటే, రోడ్లు భవనాల శాఖ రాష్ట్ర మంత్రి హెలికాప్టర్లలో తిరుగుతున్నారని విమర్శించారు. రోడ్లు వేసేందుకు కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి 20 శాతం కమీషన్లు ఇవ్వడానికి ఇష్టం లేక ముందుకు రావడం లేదన్నారు. అంతకు ముందు కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కృత్రిమ మేధస్సుతో పోటీ పడాలని, సోషల్ మీడియాలో సమయం వృథా చేసుకోవదన్నారు. ప్రభుత్వం కౌటాలలో పేద విద్యార్థుల కోసం వసతిగృహం ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు లెండుగురే శ్యామ్‌రావు, నాందేవ్, నవీన్, బండు, కార్తీక్, ఆనంద్, ప్రశాంత్, ఆనంద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కోయవాగుపై వంతెన నిర్మించాలి

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని కోయవాగుపై వంతెనను నిర్మించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. గత 50 ఏళ్లుగా వాగుపై వంతెన లేకపోవడంతో కోయవాగు, చింతగూడ ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మిల్లులో పనిచేసే కార్మికులు నిరంతరం నడిచే రోడ్డుపై వంతెన లేకపోవడం చాలా దారుణమన్నారు. రానున్న కాలంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కోయవాగుపై వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం భట్టుపల్లి గ్రామంలో విద్యార్థులు ధర్నా చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన జీడిచేను నుంచి భట్టుపల్లికి వెళ్లే రోడ్డును పరిశీలించారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులు, గ్రామస్తులు ఇబ్బందులు కలుగకుండా రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు.

ఐక్యతతోనే అభివృద్ధి

కాగజ్‌నగర్ టౌన్: అన్ని మతాల ప్రజలు ఐక్యతతో ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని బీఆర్ఎస్‌రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన సందల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శాంతి ఐక్యత సామరస్యాల ప్రాధాన్యత అంశాలపై ఆయన వివరించారు. ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేశారు.

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



సామూహిక హోమం నిర్వహిస్తున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో వెలసిన కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆషాఢ అష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాలభైరవస్వామి వారి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకుడు దేవార వినోద్‌స్వామి ఆధ్వర్యంలో భక్తులు కాలభైరవ సామూహిక హోమం నిర్వహించారు. కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ఒడిబియ్యం, నైవేద్యాలు సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్, సభ్యులు శ్రీకర్, సంతోష్, శేఖర్‌లున్నారు.

నిరుద్యోగ ర్యాలీ జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్ టౌన్: ఈనెల 22న నిర్వహించనున్న నిరుద్యోగ ర్యాలీని జయప్రదం చేయాలని విద్యార్థి నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ పొన్న రమేశ్ కోరారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరుద్యోగ ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే స్థానిక ఎస్పీఎం మిల్లులో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ నాయకులు మోజబాబీరుద్దీన్ హైమద్, అఖిల్ హైమద్, మంత్రి మల్లేష్, దుర్గం విస్తారు, జేబోగ శ్రీనివాస్, ఎన్నం శ్రీకాంత్, దుర్గం సురజ్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్‌స్కూల్‌కి విద్యార్థి ఎంపిక



సాయిహర్షిత్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: కౌటాల నజారేత్ మిషన్ స్కూల్‌కు చెందిన విద్యార్థి ఎల్కరి సాయిహర్షిత్ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక కావడంతో శుక్రవారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం నారాయణ్‌సింగ్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్, కరీంనగర్, హకీంపేట్ క్రీడ పాఠశాలల్లో నాల్గో తరగతి కోసం ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సాయి హర్షిత్ ప్రతిభ కనబర్చి క్రీడ పాఠశాలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో ముందుండాలన్నారు. సాయి హర్షిత్‌ను నజారేత్ స్కూల్ ప్రిన్సిపాల్ స్టీవెన్‌సన్ అభినందించారు.